క్లుప్తంగా

సత్కారం..



ఏడుకొండలును సత్కరిస్తున్న పార్టీ నాయకులు

గజపతినగరం: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఆరిశెట్టి ఏడుకొండలను స్థానిక బీజేపీ నాయకులు శుక్రవారం ఆయన స్వగృహం వద్ద సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్ష పదవిని వైశ్య కుటుంబీలకు ఇవ్వడం ఆనందంగా ఉందని పార్టీ మండల అధ్యక్షుడు ఎం. భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో తవుడు, సత్యనారాయణ, బి.రామారావు, గోపి, తవిటినాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవనం ప్రారంభమెప్పుడో..?



నూతన భవనం

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రికి సంబంధించి భవన నిర్మాణం పూర్తయినా ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే 85 శాతం పనులు పూర్తవ్వగా మిగిలిన పనులు కూటమి పాలనలో మెల్లమెల్లగా పూర్తిచేశారు. అయినప్పటికీ ఇంకా కొద్దిగా మైనర్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నాబార్డు నిధులు రూ. 17 కోట్లతో నిర్మిస్తున్న భవనాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారా అని నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఆర్థిక సాయం



మృతురాలి భర్తకు సాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

జామి: మండలంలోని విజినిగిరి గ్రామానికి చెందిన ఆరిపాక పార్వతమ్మ శుక్రవారం మృతి చెందడంతో అంత్యక్రియల కోసం ఆమె కుటుంబ సభ్యులకు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రూ. 21 వేలు అందించారు. పార్వతమ్మ కుటుంబ సభ్యులు నిరుపేదలు కావడంతో అంత్యక్రియల కోసం ఇబ్బంది పడుతున్న తరుణంలో యువత ముందుకొచ్చి ఆమె భర్తకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఇజ్జాడ సత్యనారాయణ, చిన సత్యనారాయణ, కె.శ్రీను, కిలారి కిరణ్, బి.హరినాయుడు, విజినిగిరి రవి, పి.త్రినాథ్, బి.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల ముందు వాహనాలు పెడితే చర్యలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఫేకర్ రోడ్డులో గల షాపుల ముందు వాహనాలను నిలిపితే షాపుల యజమానులపై చర్యలు తప్పవని ఎస్సై బి.లోకేశ్వరరావు అన్నారు. ఈ మేరకు దుకాణదారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. షాపుల ముందు వెహికల్స్ నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ సమస్య నెలకొంటుందని.. ఈ విషయాన్ని వాహనదారులకు తెలిజేయాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగాలి

లక్కవరపుకోట: వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం అవలంభిస్తూ రైతులు ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సూచించారు. మండలంలోని రంగరాయపురంలో అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ద్వారా మంజూరైన డ్రోన్‌ను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రోన్ పనితీరును ఎ.డి భానులత, కో ఆర్డినేటర్ బి. భారతి వివరించారు. కార్యక్రమంలో కరెడ్ల ఈశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, ఏఓ హరికృష్ణ, ఏఈఓ ఆర్.ముత్యాల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలి

శృంగవరపుకోట: అరుకు ఘాట్ రోడ్డులో విధులు నిర్వహించే ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.జి.నాయుడు, కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ నెల 6న గన్నెల జంక్షన్ వద్ద డిపో కండక్టర్, డ్రైవర్లపై సుమారు పది మంది ఒడిశా వాసులు గంజాయి మత్తులో దాడి చేశారన్నారు. వారిపై అరుకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అదే వ్యక్తులు తాజాగా సుంకరమెట్ట కాఫీ తోటల వద్ద, బొర్రా జంక్షన్ వద్ద మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారరని చెప్పారు. సీసీ ఫుటేజీలో నిందితులు స్పష్టంగా కనిపిస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ఆత్మగౌరవం కాపాడేలా, రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోకుంటే ఘాట్‌లో విధులు బహిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు హాజరయ్యారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం..

- కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ల బాధ్యత క్యాడర్‌దే
- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



లక్కవరపుకోట: భీమాళిలో చంద్రబాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నైజమని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల సమయంలో ఊహకు అందని హామీలు ఇవ్వడం.. గెలిచిన తర్వాత ప్రజలను వంచించడంలో చంద్రబాబుకు మించిన ఘనుడు దేశంలో ఎవ్వరూ లేరన్నారు. మండలంలోని భీమాళి, గేదెలవానిపాలెం, దాసుళ్లపాలెం గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ముందుగా భీమాళిలో ఇంటింటికీ వెళ్లి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించిన తీరును వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గేదెలవానిపాలెం గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన సమయంలో పలువురు వలంటీర్లు మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు తమను నిలువునా మోసం చేశాడని వాపోయారు. ప్రశ్నిస్తా, కాలర్ పట్టుకొని నిలదీస్తా అంటూ సినిమా డైలాగులు చెప్పిన పవనన్న జాడే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కడుబండి మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలోకి వచ్చి 13 నెలలు పూర్తయినా నేటివరకూ హామీలు అమలు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. హామీలు అమలు చేయాలంటే ఆంధ్రానే అమ్ముకోవాలని ఒక మంత్రి అనడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనను క్షేత్రస్థాయిలో ఎండగట్టేందుకు వైఎస్సార్‌సీపీ క్యాడర్ నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తూర్పాటి వరలక్ష్మి, వైస్ ఎంపీపీ శ్రీనురాజు, భీమాళి, దాసుళ్లపాలెం సర్పంచ్‌లు కొయ్యాన కృష్ణ, ముమ్మన ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు యడ్ల కిశోర్, బొడ్డు గణపతి, పార్టీ నాయకులు గేదెల నరసింహనాయుడు, మిడతాన గణేష్, గుల్లిపల్లి హరీష్, కొట్యాడ మహేష్, తూర్పాటి అప్పలరాజు, పిల్లల జ్యోతిరావ్, కొట్యాడ శ్రీనివాసరావు, ఆవాల సత్యనారయణ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకులను నిలదీయాలి..



గంట్యాడ: పెదవేమలిలో మహిళకు కూటమి ప్రభుత్వం మోసాలను వివరిస్తున్న నరసింహమూర్తి, జైహింద్‌కుమార్, తదితరులు

గంట్యాడ: ఇచ్చిన హామీలను అమలు చేయలేని కూటమి నాయకులను నిలదీయాలని జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పెదవేమలి, మురపాక, సిరిపురం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ..కూటమి నాయకులు అన్నదాత సుఖీభవ, 50 ఏళ్లకే పెన్షన్, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీల ఊసే ఎత్తడం లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జాగరపు అప్పారావు, పాటుపురెడ్డి భవాని, వర్రి పాపునాయుడు, ఈదుబిల్లి రమేష్‌కుమార్, గుండ్రపు సత్యారావు, వర్రి మల్లయ్య, వేమలి ముత్యాల నాయుడు, జాగరపు సత్యారావు, పాటుపురెడ్డి వెంకటరావు, కృష్ణంరాజు, అలమండ మహేష్, చప్ప చిన్న, తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లిలో ..



బొండపల్లి: అంబటివలసలో బాబు మోసాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొండపల్లి: మండలంలోని కెరటం, అంబటివలస, నెలివాడ, రోళ్లవాక గ్రామాలలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చల్లా చలంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, తదితరులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు పల్లి రఘు, సాలపు పెంటంనాయుడు, తాళ్లపూడి అప్పలనాయుడు, గొట్టిముక్కల గిరిధర్‌రాజు, ఆర్. చిన్నా, కెళ్ల గోపి, తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలు..



గజపతినగరం రూరల్: కొత్తబగ్గాంలో ప్రజలకు కూటమి మోసాలను వివరిస్తున్న నాయకులు

గజపతినగరం రూరల్: ఎన్నికల సమయంలో లేనిపోని అబద్ధపు హామీలిచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు గార తవుడు, బూడి వెంకటరావు అన్నారు. మండలంలోని మర్రివలస, కొత్తబగ్గాం, ధవాళేపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి, కూటమి మోసాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.పైడపునాయుడు, బెల్లాన త్రినాధరావు, తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడం టీడీపీకి కొత్తకాదు..



చీపురుపల్లి: రామలింగాపురంలో బాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: హామీలు ఇవ్వడం.. మోసం చేయడం టీడీపీ ప్రభుత్వానికి కొత్తేమీ కాదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం అన్నారు. మండలంలోని రామలింగాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, నాయకులు మీసాల వరహాల నాయుడు, బెల్లాన త్రినాథరావు, దన్నాన జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలు..



వేపాడ: శింగరాయిలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వేపాడ: కూటమి నాయకులు మోసపూరిత హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిపంచారు. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు మండలంలోని సోంపురం, అరిగిపాలెం, జగ్గయ్యపేట, శింగరాయి, ఆకులసీతంపేట, ఆతవ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు హామీలు ఇవ్వకుండా ప్రజలను మోసగించిన తీరును వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మురిపిండి గంగరాజు, నిరుజోగి వెంకటరావు, శ్రీను, యు.శ్రీను, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ బాబు మోసాలు..



జామి: ఆర్‌బీ పురంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

జామి: మండలంలోని ఆర్‌బీ పురం, గొడికొమ్ము, జేడీ వలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌బీ పురం, గొడికొమ్ము గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్, తదితరులు మాట్లాడుతూ.. మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, సర్పంచ్‌లు వర్రి కృష్ణ, పిల్లల భవానీ, తదితరులు పాల్గొన్నారు. జేడీ వలసలో మాజీ ఎమ్మెల్యే కడుబండి, తదితరులు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయిందీ వివరించారు. పథకాల అమలు చేసే వరకూ ప్రజల తరపున పోరాడుతామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె రవికుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, ఫణిబాబు, అప్పాన సుబ్రహ్మణ్యం, కిలారి సూర్యారావు, ఎస్.అప్పలరాజు, పిన్నింటి రవికుమార్, ఎన్నింటి శేషు, తదితరులు పాల్గొన్నారు.



జామి: జె.డి.వలసలో బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు..

- మాజీ ఎంపీ బెల్లాన, బొత్స సందీప్



చీపురుపల్లి రూరల్ (గరివిడి): వెదుళ్లవలస గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేస్తున్నాడని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రావడం కోసం సూపర్‌సిక్స్ పేరుతో హామీలు ఇచ్చిన కూటమి నాయకులు వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి వంటి పథకాలు అమలు చేయలేదన్నారు. 50 ఏళ్లకే పింఛన్ మాటేమిటని ప్రశ్నించారు. పేద ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నిత్యం పోరాడుతుందన్నారు. ధీరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వంలో ఏడాది కూటమి పాలనలో ప్రజలు బాగా నష్టపోయారని చెప్పారు. చంద్రబాబునాయుడు తన స్వలాభం కోసమే సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, స్థానిక సర్పంచ్ గుడివాడ తమ్మినాయుడు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, మండల నాయకులు లెంక శ్రీరాములు, ఎడ్ల అప్పారావు, ఎలకల అప్పలనాయుడు, బమ్మిడి కార్తీక్, రఘుమండ శ్రీదేవి, ముద్దాడ రమణ, అలమండ అప్పలనాయుడు, ఎల్లంటి పోలీస్‌నాయుడు, కడుమల రాంబాబు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు



నిమ్మకాయల అలంకరణలో కనకదుర్గమ్మ



108 చీరల అలంకరణలో వాసవీమాత

జామి: శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో అమ్మవారిని 108 చీరలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే స్థానిక పెట్రోల్ బంక్ వద్ద గల కనక దుర్గమ్మ ఆలయంలో అర్చకుడు భవానీశర్మ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని నిమ్మకాయలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

గుర్ల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్. శ్రీధర్ ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, బీసీ కాలనీలో శుక్రవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో తప్పనిసరిగా కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఘనంగా శ్రావణమాసం పూజలు



చీపురుపల్లి: పసుపు కొమ్ముల అలంకరణలో కనకమహాలక్ష్మి



చీపురుపల్లి: పూజలందుకుంటున్న మానసాదేవి నాగశక్తి అమ్మవారు



చీపురుపల్లి: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో సామూహిక కుంకుమార్చన పూజలు



శృంగవరపుకోట: ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ



చీపురుపల్లి: కస్పా వీధిలోని దుర్గాదేవి ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు

చీపురుపల్లి: శ్రావణ మాసం ప్రారంభం కావడంతో పట్టణంతో పాటు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తొలి శుక్రవారం కావడంతో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అందులో భాగంగానే పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. అలాగే దేవస్థానం మంటపంలో మహిళలతో సామూహిక కుంకమ పూజలు చేయించారు. అదే విధంగా పట్టణంలోని కస్పావీధిలో గల దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మండలంలోని రామలింగాపురం పరిసరాల్లో గల మానసాదేవి నాగశక్తి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం పూజలు వైభవోపేతంగా చేపట్టారు.

శాకంబరిగా దుర్గమ్మ.

శృంగవరపుకోట: శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని దేవీచౌక్ వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో దుర్గమ్మను అర్చకులు కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

నేడు విజయరాంపురంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

దత్తిరాజేరు: మండంలోని విజయరాంపురంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కూటమి మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని, పార్టీ నాయకులు, అభిమానులు తరలిరావాలని కోరారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో జాయిన్ అవ్వండి..

మెరకముడిదాం: ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరాలని ఎంఈఓలు చంద్రశేఖర్, ధర్మశ్రీను పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఈ ఓపెన్‌స్కూల్ వాల్‌పోస్టర్లను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువు మధ్యలో మానేసిన వారికి ఇదొక మంచి అవకాశమన్నారు. 2025 ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాలు నిండి ఉన్న వారు 10వ తరతగతికి.. 10వ తరగతి పూర్తయి 15 సంవత్సరాలు నిండినవారు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 94409 82120, 94419 47199 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బోసిపోతున్న అంగన్‌వాడీ కేంద్రాలు

లక్కవరపుకోట: ఒక్కప్పుడు చిన్నారుల బోసు నవ్వులతో కళకళలాడే అంగన్‌వాడీ కేంద్రాలు ప్రస్తుతం ఆ కళ తప్పి బోసిపోతున్నాయి. ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలోని గేదెలవానిపాలెంలో గల అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితి దీనికి అద్దం పడుతోంది. ఈ కేంద్రంలో గతంలో 15 నుంచి 22 మంది వరకు చిన్నారులు ఉండేవారు. ప్రస్తుతం ఇద్దరికే పరిమితమైంది. ఆ ఇద్దరు చిన్నారులు శుక్రవారం కేంద్రానికి రాకపోవడంతో కార్యకర్త, ఆయా ఎదురుచూస్తూ కాలం గడిపారు. ఈ పరిస్థితి మండలంలోని పలు గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంది. 14 కేంద్రాల్లో కేవలం ఒక్కరిద్దరు పిల్లలు మాత్రమే ఉన్నారు.

సీడీపీఓ, సూపర్‌వైజర్ల పర్యవేక్షణ కరువవ్వడంతోనే కేంద్రాలు అధ్వానంగా తయారైనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు చేరేలా ప్రయత్నాలు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారు..?

దత్తిరాజేరు: మహిళలను మోసం చేయడం కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాజీ సర్పంచ్ మహదేవ్ ఫణీంద్రుడుతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆడబిడ్డ నిధి పేరుతో 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళలకు నెలకు 15 వందలు ఇస్తామన్న హామీ ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఏడాది పాలనలో కొత్త పింఛన్లు ఒక్కటి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి సింహాచలం, జమ్ము నారాయణరావు, రంభ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే హీరోలు

మెరకముడిదాం: విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే హీరోలని ఇక్రా ఫౌండేషన్ ప్రతినిధి ఎడ్ల గౌరినాయుడు తెలిపారు. మండలంలోని చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సామాజిక స్పృహ కలిగి ఉండడంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యాబుద్ధులు చెప్పే గురువులు.. తల్లిదండ్రుల పట్ల నమ్మకంతో మెలుగుతూ వారికి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రొఫెసర్ రమణయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు బుద్ధిగా చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆల్తి రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల వినూత్న నిరసన



ఆకులు పట్టుకుని నిరసన తెలియజేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: మీ జీవితాలు మార్చేస్తాం.. అంటూ చెప్పి భూములు లాక్కున్న జిందాల్ కంపెనీ ప్రతినిధులు మాకు అన్యాయం చేశారని జిందాల్ నిర్వాసితులు మండిపడ్డారు. బొడ్డవర జంక్షన్‌లో నిర్వాసితులు ఆకులు పట్టుకుని శుక్రవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముప్పై రోజులుగా నిర్వాసిత కుటుంబాలు నిరసన తెలియజేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మీటింగుల్లో నాయకులు, అధికారులు చెప్పే సామాజిక న్యాయం ఇదేనా అని ప్రశ్నించారు. రైతులు, పేదల ఆకలి ఎవ్వరికీ కనబడడం లేదని వాపోయారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, తదితరులు పాల్గొన్నారు.